


# తిరిగి ప్రవాసానికి

నంబూరి పరిపూర్ణ

"హమ్మయ్య! ఇప్పటికి కుదిరిందండీ మన జనంలోకి రావడానికి! ఎలాగయినా మన హైద్రాబాద్ వాతావరణం యిక్కడి జీవితమే వేరనుకోండి! మన పిల్లలు హాయిగా తెలుగు మీడియంలో చదువు కుంటారు. చక్కని తెలుగు నేర్చుకుంటారు. వారాని కోమాటు మన ఊరెళ్లి వ్యవసాయం చూచు కుంటూండచ్చు" అలవి మాలిన తృప్తీ ఆనందమూ కన్నుల్లో, చెంపల్లో తళుకు లీనుతుండగా భర్తకళ్ల లోకి చూస్తూ అంది ప్రసూన.

"అవునోయ్ మరి ఈ ట్రాన్సుఫరుకి అంతగా శ్రమించి, ప్రయత్నాలు చేసిందెందుకనుకున్నావ్? ఈ సౌకర్యాల కోసమేగా మన మొస్తున్నట్లు కబు రంది మా భువనగిరి చెల్లి నిన్న సాయంత్రానికే ఎలా పరిగెట్టుకొచ్చిందో చూశావా!.....ఊ.....ఇంతకూ ఇల్లెలా వుంది? నీకు నచ్చిందా?" ఉత్సాహంగా అడిగాడు హరీంద్ర.

"ఇంటికేమండీ! బ్రహ్మాండంగా వుంది. మన ఎం.ఎల్.ఏగారు సమస్త సౌకర్యాలు అమిరేలాగా, చూడముచ్చటగా కట్టించుకున్నారుగా ఏదో మనూరి వాడు గాబట్టి మనకి పదిహేనొందలకిచ్చాడు. మరొకళ్లకయితే రెండువేలకి తక్కువ పుచ్చుకోడు."

"చిన్నప్పటినుంచీ కలిసి చదువుకున్నాం. ఆ అభిమానం పోలేదుమరి. సరేగాని యివాళ ఒదినా మరదళ్లు సామాన్లు సర్దే యజ్ఞం మొదలెడతారు గాబోలు ముందుగా నాకు ఓ కప్పు కాఫీ యిప్పిస్తే టిఫిన్ క్యాంటీన్లో కానిచ్చేస్తాను."

"అయ్యో ఇంకా పాలు పొంగించలేదండీ! మీ చెల్లి యిప్పుడే స్నానం ముగించి, ఆ ప్రయత్నమే చేస్తోంది. పాలు పొంగించందే మరేదీ పొయ్యి మీద కెక్కించ గూడదు కదండీ!" నొచ్చుకుంది ప్రసూన.

"సరే సరే కానివ్వండి. ఆ క్యాంటీన్ కాఫీ బాగుండి చావదు. టీ తో సరిపెట్టు కుంటాన్లే ఈ పూటకు" అంటూ పిల్లలకి 'బై' చెప్పి 'మారుతీ'లో కూర్చుని కంపెనీ దారి పట్టించాడు హరీంద్ర.

హరీంద్ర ప్రసూనల కుటుంబాలు ముప్ఫయేళ్లకి ముందే కృష్ణా తీరమొదిలి తెలంగాణాకి తరలి వచ్చాయి. అప్పట్లో ఎకరం ఏభైరూపాయిల కాడికి ఏభై ఎకరాలు కొనుక్కుని హరీంద్ర తల్లిదండ్రులు మెదక్ దగ్గర ఓ పల్లెటూళ్లో స్థిరపడ్డారు. ప్రసూన అమ్మానాన్నలు నిజమాబాదు దగ్గర ఎకరం వంద చొప్పున ముప్ఫయ్యెకరాల మాగాణీ కొని అక్కడ కాపురం బెట్టారు.

హరీంద్ర తండ్రి రాఘవయ్య గారు తెలివైన వ్యవసాయదారుడు, కష్టజీవి. పొలంలో మంచి జలపడే చోట బోరువేయించి సమృద్ధిగా నీరు లభించే ఒసరేర్పరుచు కున్నాడు. వ్యవసాయ శాఖవారి సలహాల్నీ ఆధునిక వ్యవసాయ పద్ధతుల్నీ జాగ్రత్తగా అవలంబించి రెండేళ్లకి బీడును సస్య శ్యామలం చేయగలిగాడు.

హరీంద్రకు పదేళ్లక్రిందట ప్రసూనతో పెళ్లవగానే ఢిల్లీలో ఉద్యోగమయింది. ఫారిన్ కొలాబరేషన్‌తో నడుస్తోన్న ఓ గవర్నమెంట్ రక్షణశాఖ పర్చేజింగ్ సెక్షనులో పనిచేస్తున్నాడు. ఐదారేళ్లక్రితం ఈ కంపెనీ బ్రాంచొకటి హైదరాబాదులోనూ ప్రారంభించబడింది. రెండేళ్ల క్రితం తండ్రి పోయినప్పట్నించీ కౌలుదార్ల చేతుల్లో పంటలూ పొలమూ తీవ్రంగా దెబ్బతింటున్నట్లు గమనించి హైద్రాబాద్ రావడానికి భగీరథ ప్రయత్నాలు చేశాడు హరీంద్ర. ఈనాటికి ట్రాన్సుఫరు రావడం తన కోర్కె నెరవేరడం జరిగింది.

ఏ గదిలో వుండాల్సిన సామాన్లు ఆ గదుల్లో పొందికగా సర్ది, పెరడు శుభ్రంచేయించేసరికి వారం పట్టింది. ఇంటి ముంగిలి నిండా రకరకాల పూలమొక్కలూ, ఇంటికిరుపక్కలా, పెరట్లో అన్ని రకాల పండ్లచెట్లూ వున్నాయి. ఇంటినంతా ముచ్చటగా చూచుకుని తృప్తిగా నిట్టూర్చింది ప్రసూన.

ఇంట్లోదిగి అప్పుడే వారమయ్యింది. ఇరుగుపొరుగుల పరిచయమింకా అవలేదు. ప్రక్కింటివాళ్లయినా పలకరించకపోవడం చిత్రమనిపించింది, ప్రసూనకు. ఓ సాయంత్రం ఆ వీధిలో పదిళ్లకీ వెళ్లి తనని పరిచయం చేసుకుంది. ప్రతి ఇంట్లోనూ 'పేటా' అనే ఆగ్రా మిఠాయి ప్యాకట్లును పిల్లల చేతుల్లో వుంచింది. తన భర్త ఉద్యోగ వివరాల నించీ సిటీకి చేరువలోనే తమ స్వంతూరున్న సంగతీ అందుకనే ఢిల్లీ నుంచి యిక్కడికి ట్రాన్సుఫరు చేయించు కున్నామనీ ఎంతో కలుపుగోలుగా అరమరికలు లేకుండా మాట్లాడి తీరిక చేసుకుని తమింటి కొచ్చి కొంచెం సేపు గడిపి వెళ్లండని ప్రతి ఇల్లాల్నీ ఆహ్వానించి వచ్చింది.

వేసవి శలవులు గడచిపోయి స్కూళ్లు తెరవడం మొదలయ్యింది. ప్రసూన పిల్లలిద్దరికీ స్కూలు అడ్మిషన్లు దొరికాయి. రోజూ స్కూలు కెళ్తున్నారు. వాళ్ళొచ్చి అప్పుడే రెండు నెలలు కావస్తోంది. చుట్టు పక్కల పిల్లల్తో ఇంకా జట్టు కలవలేదు. ఇంటికి యింతవరకూ పెద్దవాళ్లెవరూ రాకపోవడంతో సహజంగా వాళ్ల వెంబడి వచ్చే పిల్లలూ రాలేదు. బాబు, పాప, బొత్తిగా పసివాళ్లు దిగులు దిగులుగా కాంపౌండు లోపలే ఆడుకుంటున్నారు.

అరవైకుటుంబాలున్న ఆ చిన్న కాలనీలో హరీంద్ర సహోద్యోగులు పదిమంది ఉన్నారు. మిగిలిన వాళ్లంతా ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డప్పుడే రాజధాని కొచ్చారు. అంతపెద్ద చదువులు లేనప్పటికీ ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో మంచి జాబులు సంపాదించగలిగారు. చాలామంది తమ ఉద్యోగాలతోపాటు స్వంత ఇండ స్ట్రీలు సైడు బిజినెస్సులు నడుపుకుంటూ బాగా వృద్ధిలో కొచ్చారు. స్వంత ఇళ్లు ఏర్పరుచుకున్నారు. ప్రతి ఒక్కరూ సుఖంగా బ్రతకడం, పైకిరావడం కోరదగిందేఅయితే తెల్లారిందగ్గర్నుంచీ మగవాళ్లు బ్రతుకు పరుగు పందెంగామారి, విశ్రాంతంటే 'టైం వేస్టు' అనుకునే స్థితిరావడం ఎంతవరకు మేలు? ఇటు ఆడవాళ్లమో 'నవధనిక వర్గానికి' అద్భుతమైన ప్రతీకలుగా మారారు. ప్రక్కింటి వాళ్లతో మాట్లాడ్డం తమ ఘనతకు భంగమనుకునే ఒంటెత్తు పోకడలు ప్రబలమవుతున్నప్పుడు "మనిషి సంఘ జీవి కాదేమో"ననే అనుమానం రాకతప్పదు.

ఈ వాతావరణంలో ప్రసూనకి ఊపిరి సలపనట్టుగా వుంది. కాలనీలో కుటుంబాలన్నీ ఏ విధాన, ఏం చేస్తే దగ్గరవుతాయాఅన్న ఆలోచన పట్టుకుందామెకు. దాంతో మళ్లీ చాలామంది ఆడవార్ని కలిసి, మహిళామండలి ఒకదాన్ని స్థాపించుకుందామని ప్రతిపాదించి, దానివల్ల కలిగే లాభాలన్నీ వివరించింది. రోజూ మూడు నాలుగు గంటల మధ్య కమ్యూనిటీ హాలులో అందరూ కలుసుకుని కొత్త కొత్త వంటకాలూ, చేతిపనులూ ఒకరినించి మరొకరం నేర్చుకుందామంది. అందరం కలిసి కొన్ని వారపత్రికలు తెప్పించుకు చదువుతూ క్రమంగా చిన్న గ్రంధాలయ మేర్పాటు చేసుకుని మనస్సుకు చైతన్యం కలిగించు కుందామని కూడా భోధించింది. వచ్చే ఆదివారం కాలనీ స్త్రీలందరం తమ ఇంట్లో మొదటి సమావేశం ఏర్పాటు చేసు కుందామనీ ప్రతిఒక్కరూ తప్పక హాజరవ్వాలనీ చెప్పింది. అందుకందరూ అంగీకరించారు.

ఆదివారం వచ్చింది. ఆడవారు మాత్రం మీటింగుకు రాలేదు. ఎంతో ఎదురు చూడగా చూడగా ముగ్గురు కాలేజీ అమ్మాయిలు మాత్ర మొచ్చి ప్రసూనతో పాటు నిరాశగా నిట్టూర్చారు.

కార్తీకమాసపు వాతావరణం చల్లగా ఆహ్లాదంగా వుంది. స్నేహమధురిమకూ పరస్పర సహాయ సానుభూతులకూ దూరమై తను బొత్తిగా వంటరిది అన్నట్టు అన్పించసాగింది, ప్రసూనకు. ప్రతి ఏటా ఢిల్లీలో ఈ మాసంలో ఎంత ఆర్భాటంగా వనభోజనాలు ఏర్పాటు చేస్తుండేవాళ్లు. కాలనీలోని ఆడా మగా పిల్లా జెల్లా అందరి ముఖాల్లో ఆనందపు దివ్వెలు ఎలా వెలుగుతుండేవి!.

ప్రసూనకు మళ్లీ బుర్రలో కొత్త ఆలోచనలు మెరిసి హవుస్‌విజిట్స్‌కి బయల్దేరింది. వనభోజనాల గురించి ఒకొక్క ఇంటావిడకీ చెప్పింది. ఇంటికో పదార్థం చేసుకు ఇందిరా పార్కుకో, సంజీవయ్య పార్కుకో పోయి బంతి భోజనాలు తినేసి ఆటల్తో పాటల్తో సంతోషంగా గడిపి వద్దామని ఉత్సాహ పరిచింది. "మగాళ్లు లేకుండా ఆడాళ్ల మొక్కళ్లమే బయటకొచ్చే అలవాటు మాకు లేదు." ఫలానా ఇంటివాళ్లకూ మాకూ మాటల్లేవు. మరి వాళ్లొస్తున్న చోటుకు మేమెలా వస్తాం?" "ఇంతవరకూ మా కుటుంబాల్తో తప్ప ఇతర్లతో కలిసి తిని ఎరగం ఇప్పుడు మైలకూడు తినాలంటే ప్రాణమొప్పదు. ఇలాంటి రకరకాల అభ్యంతరాల్తో వారం రోజుల ప్రసూన కృషి నిష్ఫలంగా మిగిలింది.

ఆమెకి తన మీద తనకు విశ్వాసం సన్నగిల్లింది. తనమీదనే బోలెడు కోపమెచ్చింది. తను వట్టి అసమర్థురాలు. కార్యదక్షతలేని మనిషి ఉన్నట్టుండి యింతలావు తలనొప్పి పట్టుకుందే! కణతలు నొక్కుకుంటూ పడకమీదకి వాలి కళ్లుమూసుకుంది. ఎంతకీ నిద్రపట్టడం లేదు. ఢిల్లీలో గడిచినరోజులూ అక్కడ జరిగిన ఒక్కొక్క సంఘటనా కళ్లలో మెదిలాయి.

అక్కడ కంపెనీ క్వార్టర్సులో ఆఫీసరు క్యాడరూ వర్కర్ల క్వార్టర్లకుచెందిన ఏభై తెలుగు కుటుంబాలుండేవి. ఉద్యోగస్థాయిలూ వారసత్వాలు కంపెనీ ఆవరణ వరకే. ఇళ్ల దగ్గర ప్రతివారిలో, 'తెలుగు జాతి మనదీ నిండుగ వెలుగు జాతి మనదీ" అనే గొప్ప సోదర భావం సమృద్ధిగా వుండేది. ఏ కన్నాట్ ప్లేస్‌లోనో , కుతుబ్‌మినార్ దగ్గరో తెలుగు కంఠమేదైనా వినబడితే - మంజుల వీణా నిస్వనంగా వినబడి, ప్రాణం లేచి వచ్చేది. నిమిషాల్లో వారితో పరిచయాలైపోయి ఆత్మీయత వెల్లివిరిసేది. చకచకా అడ్రసు లిచ్చుకుని - ఒకరింటికి మరొకర్ని రమ్మని మని ఆహ్వానించుకోవడం జరిగేది. తెలుగు వాళ్లయితే చాలు కులం గోత్రం, ప్రాంతం, అంతస్థూ యిలాంటివేమీ అక్కరలేదు.

అక్కడి స్త్రీలలో కొంతమంది గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్సయిన వారు- వంటవన్లకే తమ చదువుని అంకితం చెయ్యడమిష్టం లేనివారు - ఎం.ఎడ్.బి.ఎడ్ చేసి విద్యాసంస్థల్లో పనిచేస్తుండే వారు షిఫ్టు సిస్టం వల్ల పిల్లలు పన్నెండు గంటలకి ఇళ్లకువచ్చేస్తే రెండింటికి చేరుకునేవారు. అమ్మావాళ్లు వచ్చేంతవరకు పిల్లలు తమ కిష్టమైన ఆంటీల ఇళ్లల్లో - వాళ్లిచ్చే చిరుదిళ్లు తింటూ, వాళ్ల ప్రేమాదరణలో ఆడుకోవడం రివాజు. ఉద్యోగినుల కిక పిల్లల్ని గురించి చింతించాల్సిన అవసరమే వుండేదిగాదు.

ఒక ఆపత్సమయంలో ఇరుగుపొరుగుల వారు తమనెంత ఆదుకున్నారో - మర్చిపోగలదా తను! కొన్ని పరిస్థితుల కారణంగా రెండో కాన్పుకి తను పుట్టింటి కెళ్లకుండా - కంపెనీ హాస్పిటల్లోనే జరుపుకో వలసొచ్చింది. ఉత్తరదేశపు స్త్రీలయితే అసలు మొదటి కాన్పుకి కూడా పుట్టిళ్ల కెళ్లరు. కంపెనీ హాస్పిటలు పరిశుద్ధతకు మారుపేరనాలి. ఉచిత వైద్యం అమితశ్రద్ధ చూపే డాక్టర్లు అవిరామంగా సేవలు చేసే నర్సులు ఇన్ని రకాల సౌకర్యాలు పుట్టిళ్లలో వుండవుగా మరి.

ఒక అర్ధరాత్రి వేళ తనకునొప్పులు మొదలయి నాయి. హరీంద్ర కంగారు పడుతూ గ్యారేజినుంచి కారు బయటకు తీసి- తనను నెమ్మదిగా కారు దగ్గరకు తీసికెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. తమ ఇంటి పై భాగాన ప్రక్క కార్టరులో వున్న లక్ష్మీ , భారతీ, స్వర్ణగార్లు తన కేకలూ, కారు అలికిడి విని - పరిస్థితి గ్రహించి ఉన్న పళంగా వచ్చి కార్లో కూర్చుని ఆస్పత్రికి వచ్చారు. తెల్లవారు ఝామున పాపపుట్టేంతవరకూ - కాన్పులవార్డుకు ఎదురుగా , గడ్డగట్టే జనవరి నెల చలిలో అలా కూర్చుండి పోయారు. పుట్టుకతోనే పాపకి పచ్చ కామెర్లొచ్చాయి. అందుకు ప్రత్యేకచికిత్స అవసరమై పది పన్నెండు రోజుల వరకు డిశ్చార్చి కాలేక పోయింది తను. అన్నాళ్లూ యిటు తనక పసరమైనవీ బాబూ, శ్రీవారికీ కావలసిన సకలమూ పంపారు. ఇంటికొచ్చాక కూడా నెల్లాళ్లవరకూ ఎవరో ఒకరు క్యారియర్లు పంపుతూండేవారు. కాలనీలో ఎవరికి కాన్పయినా యిదే పద్ధతి - యిదే ఆదరణ.

ఆంధ్రాకి వెళ్లి తిరిగివచ్చే ప్రతివాళ్లూ - కాకినాడ కాజాలో, విశాఖ పనసపళ్లో బందరుగాజారొయ్యలో - పదిమందికీ సరిపడా పట్టుకొచ్చి పంచేవారు. ఒకసారి తనుకూడా - హైదరాబాదు నించి ఆరు కేజీల దేశవాళీ రేగుపళ్లు తీసికెళ్లింది. ఎలా ఎగబడి, ఎంతిష్టంగా తిన్నారందరూ!

తమ కాలనీకి అన్ని హంగులున్న క్లబ్బుంది. చక్కని గ్రంథాలయముంది. సాయంత్రమయ్యేసరికి పిల్లలూ పెద్దలూ అంతే అక్కడ ప్రత్యక్షం. కొత్త దంపతులూ, ఆడా మగా పిల్లలూ టేబుల్ టెన్నిస్, షటిల్, బాడ్మింటన్ పరపళ్లు తొక్కుతూ ఆడడం బహుముచ్చటనిపించేది చుడ్డానికి .

ప్రతి ఏడూ - తెలుగు కుటుంబాలన్నీ తప్పని సరిగా ఉగాది వేడుకలు అట్టహాసంగా చేసుకునేవి. అలాగే క్లబ్బువార్షికోత్సవాల్ని మిగిలిన రాష్ట్రాల వారితో కలిసి అత్యుత్సాహంగా జరుపుకునేవారు, మగవారితో పోటాపోటీగా - స్త్రీలంతా ఆటపాటల పోటీల్లో, నృత్యనాటక ప్రదర్శనలలో స్వేచ్ఛగా, నిస్సంకోచంగా పాల్గొంటుండేవారు. పంజాబీ సోదరులు ఆడామగా భంగ్రా నృత్యం మొదలెడితే, హుషారెగదన్నే ఈలలూ, చప్పట్లూ, గంతులతో ఎంతకీ నృత్యం ముగించేవారుగాదు. ఆ ఉల్లాసం, ఆ ఆత్మీయత మచ్చుకైనా కనబడవే యిక్కడ!.

ప్రసూన ఓ సాయంత్రం పూలచెట్లకి నీళ్లు పెడుతుండగా బాబుగాడి క్లాసుమేటు కుర్రాడొకడు రొప్పుతూ వచ్చి "మీ అబ్బాయి బస్సు దిగుతూ పడిపోయాడండీ" అని కబురందించాడు. నీళ్లట్యూబు కిందపడేసి బస్టాండుకు పరుగుదీసింది ప్రసూన.. కొడుకు బొక్క బోర్లా అలాగేపడిఉన్నాడు. భద్రంగా లేవనేత్తబోయింది. ఒక్కపెట్టున ప్రాణాలు పోతున్నట్టు అరిచాడువాడు. ఎలాగో ఆటో డ్రైవరు సహాయంతో వాణ్ణింటికి చేర్చి హరీంద్రకు ఫోన్‌చేసింది. తక్షణం హరీంద్ర వాలి పోయాడు. నిజాం ఆర్థోపెడిక్‌లో అడ్మిట్ చేశారు. పిల్లాడి ఎడమభుజం విరిగి ఎముకలు ఒకదాని మీదొకటి ఎక్కాయి. మోచేతి జాయింటు తొలగింది. చేతికి పైనుంచి క్రిందిదాకా ప్లాస్టరువేశారు. తగిన చికిత్సలన్నీ చెయ్యడానికి నెల్లాళ్లు హాస్పిటల్‌లో ఉంచమన్నారు. ప్రసూన ఒక్కతే హాస్పటలుకీ ఇంటికీ మధ్య తిరుగుతోంది. రాత్రులు అక్కడే వుంటోంది. పాపను ఆ నెల్లాళ్లూ స్కూలుమాన్పించి తాతగారింటి దగ్గర వదిలొచ్చాడు హరీంద్ర. బాబుకి పూర్తిగా నయమై కట్టిప్పే సరికి రెణ్ణెల్లు పట్టింది. ప్రక్కిళ్లవారు ఎప్పుడైనా ఒకసారి పలకరించేవారు. దూరపువాళ్లదీ లేదు. ఎలాంటి సహాయమూ ఎవరినుంచీ అందలేదు. ఎడారిలో బ్రతుకుతున్నామనుకొంది ప్రసూన.



దోసెలు పల్చగా రావాలంటే పిండిలో కొంచెం అన్నంగంజి కలపాలి.

హరీంద్ర కుటుంబం - తమ స్వంతప్రదేశమనే చోటుకొచ్చి అప్పుడే పది నెలలయ్యింది. సంవత్సరాది పండుగ రాటానికి యింకా యిరవై రోజులుంది. ఇప్పటికి దంపతులిద్దరి చిత్తాలు బొత్తిగా మెత్తగిల్లి పోయినయ్. దేనిమీదా ఆసక్తి లేదు.

ఈ పండుగకి కాలేజీ అమ్మాయిల్లో ఎందుకనో ఉన్నట్టుండి హుషారు పుట్టుకొచ్చింది. బిలబిల మంటూ ప్రసూనను చుట్టేశారు. అందరం కలిసి ప్రవాసాంధ్రుల మాదిరిగా ఉగాది వేడుకలు జరుపుకుందామన్నారు. ఆటలూ పాటలూ, వ్యాసరచన పోటీలూ జరిపి గెలిచిన పిల్లలకు బహుమతిలిచ్చుకుందామన్నారు. పోటీల్లో పాల్గొనడానికి తమ అక్కల్నీ ఒదినెల్నీ ఒప్పించామన్నారు. ఈ మాటలకి ప్రసూన ప్రాణం లేచి వచ్చింది. ఇన్నాళ్ల తన కృషికి సత్ఫలితాలు కనబడుతున్నాయి [illegible] పొంగి పోయింది.

కమ్యూనిటీ హాలు ఆవరణలో ఆటల ప్రాక్టీసు ప్రారంభమయ్యింది. వయసులో వున్న అమ్మాయిలు రన్నింగ్‌రేస్ ప్రాక్టీసు చేస్తున్నారు. నాలుగురోజులు గడిచేసరికల్లా మగవాళ్ల దృష్టికీ సంగతి వెళ్లింది. వెంటనే అరడజనుమంది మగమహారాజులు రాత్రి ఏడు గంటలప్పుడు హరీంద్ర ఇంటిమీది కొచ్చి - 'ఏమిటి సార్ ఈ దారుణం? ఆటలపోటీలనీ, రన్నింగు రేసులనీ - ఇళ్లల్లో ఆడాళ్లని బజారుకెక్కించడం మీ యావిడకేమన్నా బాగుందా? ఇక్కడున్న కుటుంబాలు మావన్నే మాకళ్లముందు మా ఆడాళ్లు ఎగిరిగంతులేస్తూ, పరుగులు బెడుతుంటే- చూస్తూ ఊరుకుందుకు మేము గాజులు తొడుక్కు కూర్చున్నామా? మీ యావిడకేం పనీపాటా లేనట్టుంది. కొంచెం అదుపులో బెట్టుకుంటే మర్యాదగా వుంటుంది." అంటూ దులిపేసి వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయారు.

మరో నాలుగు మాసాలకి భూమ్యాకాశాలు తల్లకిందులయ్యే ప్రయత్నాలు చేసి మళ్లీ ఢిల్లీకి ట్రాన్స్ఫరు చేయించుకోగలిగారు ప్రసూనాహరీంద్ర. ప్రతి విషయంలో, ప్రతి కార్యక్రమంలో ముందుండే ఉత్సాహభరితమైన, నిష్కపటమైన జంట - మళ్లీ తమతో వచ్చి కలిసినందుకు తెలుగు కుటుంబాలన్నీ అమిత సంతోషపడిపోయారు. ముందుగా స్వర్ణ, లక్ష్మీ, భారతీలు పరుగుపరుగున వచ్చి మనసారా పలకరించి, కరువుదీరా కబుర్లు చెప్పారు. స్నానాలు ముగించుకు, హాయిగా నడుములు వాల్చి ప్రయాణ బడలిక తీర్చుకోమనీ, వంట ప్రయత్నాలేం చెయ్యొద్దనీ, కారియర్లు పంపుతామనీ మరీ మరీ ఒప్పించి వెళ్లారు.

రెండు మూడు రోజుల వరకూ ఆడవారూ మగవారూ బృందాలు బృందాలుగా వచ్చి హరీంద్ర వాళ్లను పలకరించి తిరిగి వచ్చినందుకు అభినందించి పోతూనే వున్నారు. హడావుడి కాస్త సర్దుమణిగాక, 'హమ్మయ్య! ఎలానైతేం మళ్లీరాగలిగామండీ నిజమైన ఆప్తుల మధ్యకి! ఈ స్నేహం, ఈ ఆత్మీయత సంవత్సరం పాటు కోల్పోయి ఎంత బెంగటిల్లి పోయామండీ' ! అంది ప్రసూన నిశ్చింతగా ఊపిరితీస్తూ.

"నీమాట అక్షరాల నిజం ప్రసూనా!" హరీంద్ర మందహాసం చేస్తూ మన స్ఫూర్తిగా బలపరిచాడు. ■